సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం। 26। ఫిబ్రవరి। 2023



టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రులను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం శనివారం తనిఖీ చేసింది.



ఉపాధిహామీ పనులు పరిశీలన

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులను శనివారం రాష్ట్ర పరిశీలన బృందం పరిశీలించింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/17.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

కుక్కల బెడద నివారిస్తాం

- కుక్కల సమస్యపై స్పందించిన కమిషనర్ అన్వేశ్
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో మున్సిపల్ కమిషనర్‌ను కోరిన పురవాసులు
- పరిష్కార మార్గాలు చూపిన కమిషనర్



వేములవాడ: వేములవాడ మున్సిపల్ పరిధిలోని 28 వార్డులలో నెలకొన్న సమస్యలపై 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫోన్‌ఇన్‌లో పలువురు పట్టణవాసులు తెలిపిన సమస్యలకు కమిషనర్ అన్వేశ్ పరిష్కార మార్గాలు చూపారు. దాదాపు ప్రతీ వార్డు నుంచి ప్రజలు తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. వారు తెలిపిన సమస్యలను నోట్ చేసుకున్న కమిషనర్ అన్వేశ్ కొన్నింటికి వెంటనే పరిష్కారమార్గాలు చూపారు.

ప్రశ్న: వేములవాడలో కుక్కల గుంపులు పెరిగాయి. నడుచుకుంటూ వెళ్లాలంటేనే భయంగా ఉంది.
(కోల రామ్మూర్తి–సాయినగర్, సయ్యద్ పాషా–వినియోగదారుల మండలి అధ్యక్షుడు, నాలా లింగమూర్తి)
కమిషనర్: కర్నూల్ నుంచి ప్రత్యేక బృందాలను తెప్పించి ఈనెల 28 నుంచి కుక్కలను ఇతర ప్రాంతాలకు తరలిస్తాం.

ప్రశ్న: ఉప్పుగడ్డవీధిలో మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రావడం లేదు.
(సుదర్శన్ యాదవ్, ఉప్పుగడ్డవీధి)
కమిషనర్: ఆ ప్రాంతం మెట్టగా ఉండటంతో సమస్య తీవ్రమైంది. మరో పైప్‌లైన్ ఏర్పాటు చేసి భగీరథ నీళ్లు సమృద్ధిగా వచ్చేలా కృషి చేస్తాం.

ప్రశ్న: భవానీనగర్‌లో నల్లానీటి సరఫరా పైప్‌లైన్ లీకేజీలు పెరిగిపోయాయి.
(అశోక్, గంగపుత్ర సంఘం, 24వ వార్డు)
కమిషనర్: భవానీనగర్‌తోపాటు చుట్టూ ఉన్న కాలనీలలో ఎలాంటి లీకేజీలు ఉన్న సరిచేయాలని నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశిస్తాను.

ప్రశ్న: కట్టకింది బస్టాండు జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు ఏం చర్యలు తీసుకుంటారు?
(మోటూరి ప్రవీణ్, అంబేద్కర్‌చౌక్)
కమిషనర్: కట్టకింది బస్టాండు ప్రాంతంలో నాలుగు రోడ్లకు తప్పకుండా స్పీడ్ బ్రేకర్లు వేయిస్తాం. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడతాం.

ప్రశ్న: కోనాయపల్లి, మల్లారం ప్రాంతాలలో మోరీలు తీయడం లేదు. మట్టిరోడ్లతో ఇబ్బందులు పడుతున్నాం.
(వెంకటేశం, కోనాయపల్లి, కె.సుదర్శన్‌రెడ్డి, మల్లారం జంక్షన్)
కమిషనర్: డ్రెయినేజీలు నిత్యం శుభ్రం చేయిస్తున్నాం. దోమల నివారణకు వార్డుల వారీగా ఫాగింగ్ చేయిస్తాం.

ప్రశ్న: కుక్కలకు వింత చర్మ వ్యాధులు వస్తున్నాయి.
(ఫహద్‌పాషా, సాయినగర్, 11వ వార్డు)
కమిషనర్: వెటర్నరీ విభాగం అధికారులతో మాట్లాడి అలాంటి కుక్కలను మెడికేషన్ చేయించి, ఇతర ప్రాంతాలకు పంపించే ప్రయత్నం చేస్తాం.

ప్రశ్న: రోడ్డుపైనే కంకర కుప్పలు ఉంటున్నాయి. జనం ఇబ్బందులు పడుతున్నారు.
(అనిల్, 3వ వార్డు)
కమిషనర్: కాంట్రాక్టర్‌తో మాట్లాడి కంకర కుప్పలను వెంటనే తొలగింపజేస్తాం.

ప్రశ్న: ఖాళీ ప్రదేశాల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి.
(తాటిపెల్లి శ్రీనివాస్, ఉప్పుగడ్డవీధి)
కమిషనర్: ఖాళీ ప్రదేశాల్లో చెత్తకుప్పలు లేకుండా చర్యలు తీసుకుంటాం. శానిటేషన్ సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. ఖాళీ ప్రదేశాల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం.

ప్రశ్న: మురికినీరంతా ఇళ్ల ముందే నిలుస్తుంది. డ్రెయినేజీలు నిర్మించడం లేదు.
(సునీత, పాపన్నచౌక్)
కమిషనర్: పాపన్నచౌక్ నుంచి మల్లారం జంక్షన్ వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు, ఫుట్‌పాత్‌లు నిర్మిస్తాం. ఇళ్ల ముందు నిలుస్తున్న నీటి తొలగింపజేస్తాం.

ప్రశ్న: ఎల్ఐడీ ఆఫీస్ రోడ్డులో డ్రెయినేజీలు తీయడం లేదు.
(మిర్యాల బాలకృష్ణ)
కమిషనర్: శానిటేషన్ సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మా ప్రాంతంలో పిచ్చిమొక్కలు బాగా పెరిగాయి.? (గడప కిశోర్‌రావు, 11వ వార్డు)
కమిషనర్: శానిటేషన్ సిబ్బందిని పంపించి రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగింపజేస్తాం.

ప్రశ్న: మటన్ మార్కెట్ సక్రమంగా లేదు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు?
(మహమ్మద్ యూసుఫ్, ముదిరాజ్‌వీధి)
కమిషనర్: మటన్ మార్కెట్‌ను సందర్శించాలని తమ సిబ్బందిని ఆదేశిస్తాను. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

ప్రశ్న: బద్దిపోచమ్మ గుడి వద్ద చికెన్ సెంటర్లతో ఇబ్బందులు పడుతున్నాం.
(శేఖర్, బద్దిపోచమ్మ వీధి)
కమిషనర్: బద్దిపోచమ్మ గుడి వద్ద ఉన్న చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఇప్పటికే నోటీసులిచ్చాం. శానిటేషన్ సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న: గుడి చెరువులోకి మురికినీరు వచ్చి చేరుతుంది.
(చెట్టిపల్లి రాకేశ్)
కమిషనర్: రూ.33 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. గుడి చెరువులోకి మురికినీరు చేరకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ప్రముఖుల ఇళ్ల వద్దనే పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. మామూలు జనం ఉండే ప్రాంతాలను పట్టించుకోవడం లేదు.
(ఎర్రం మధు, అర్బన్ కాలనీ)
కమిషనర్: అలాంటిదేమీ లేదు. అన్ని ప్రాంతాల్లో శానిటేషన్ పనులు చేయిస్తాం. ఇటీవల మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులు తిరిగే ప్రాంతాలపై దృష్టిపెట్టాం.

ప్రశ్న: వేములవాడ పట్టణాన్ని ఆనుకుని ఉన్న మూలవాగులో ఉన్న రెండు చెక్‌డ్యామ్‌లలోకి మురికినీరు వచ్చి చేరుతుంది. ఎలాంటి చర్యలు తీసుకుంటారు.?
(రేగుల సంతోష్‌బాబు, 20వ వార్డు)
కమిషనర్: రూ.33కోట్లతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. మూలవాగులో మురికి చేరకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: బైపాస్‌రోడ్డులో నిబంధనలు పాటించకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. సెట్‌బ్యాక్ లేదు. పర్మిషన్‌కు రూ.లక్ష చొప్పున వసూలు చేస్తున్నారు.
(రేగుల మల్లికార్జున్)
కమిషనర్: పర్మిషన్ కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. టీ–పాస్ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. నిబంధనలు అతిక్రమించి పనులు చేపడితే చర్యలు తీసకుంటాం.

ప్రశ్న: పట్టణంలోని జంక్షన్‌ల పేర్లు మార్చండి. కోరుట్లబస్టాండు ప్రాంతాన్ని పాపన్నచౌక్‌గా, చెక్కపల్లి బస్టాండు ఏరియాను తెలంగాణచౌక్‌గా, జగిత్యాల బస్టాండును కట్టకింద బస్టాండుగా నామకరణం చేయండి.
(ముప్పిడి సుధీర్, రామతీర్థపు హరీశ్)
కమిషనర్: మున్సిపల్ పాలకమండలి సమావేశంలో తీర్మానించిన తర్వాత తప్పకుండా మీరు కోరిన విధంగా జంక్షన్‌ల నామకరణం చేస్తాం. పోరాటవీరుల పేర్లతో తప్పకుండా బోర్డులు ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: తిప్పాపూర్ పోచమ్మ గుడి వద్ద రోడ్డు, డ్రెయినేజీ సక్రమంగా లేదు. ఉత్సవాలు నిర్వహించే సమయంలో భక్తుల ఇబ్బందులు పడుతున్నారు?
(ఆలూరి మమతారెడ్డి, రాజశేఖర్, అయ్యోర్‌పల్లి, 3వ వార్డు)
కమిషనర్: రోడ్లను బాగుచేసి, డ్రెయినేజీలను శుభ్రం చేస్తాం. రోడ్డుపై రోలింగ్ చేయిస్తాం.

ప్రశ్న: వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద గల జంక్షన్‌ను ఎప్పుడు బాగుచేస్తారు?
(దుర్గం పర్శరాం, పాపన్నచౌక్)
కమిషనర్: జంక్షన్‌ల అభివృద్ధికి నిధులు కేటాయించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

ప్రశ్న: పెంపుడు కుక్కలకు నిబంధలు ఏమిటి?
(పెంట రాజు, అడ్వకేట్, అంబేద్కర్‌నగర్)
కమిషనర్: పెంపుడు కుక్కల యజమానులకు త్వరలోనే నోటీసులు జారీచేస్తాం. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధిస్తాం. కుక్కలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

ప్రశ్న: పారిశుధ్య సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారు.
(వాసం భూమేశ్వర్, భీమేశ్వరాలయం వీధి)
కమిషనర్: పారిశుధ్య స్బిబందికి ఎవరు డబ్బులు ఇవ్వవద్దు. వారికి ప్రతీ నెల జీతం ఇస్తున్నాం. ఎవరైనా డబ్బులు అడిగితే మాకు ఫిర్యాదు చేయండి.

సత్వరమే పరిష్కారం

- సమస్య ఏదైనా ఫిర్యాదు చేయొచ్చు
- సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య
- 'సాక్షి' ఫోన్‌ఇన్ ద్వారా ప్రజలకు సమాధానాలు



సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో ఎలాంటి సమస్యనైన సత్వరమే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ సూచనలతో మున్సిపాలిటీలో పాలన ఆదర్శంగా నిలుస్తోందన్నారు. నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటున్నారన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 39 వార్డుల సమస్యలపై శనివారం 'సాక్షి' పత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్‌లో ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే జాతీయ స్థాయిలో వరుసగా స్వచ్ఛ అవార్డులు వస్తున్నాయన్నారు. ప్రజాసమస్యల సాధనలో సాక్షి చేపట్టిన కార్యక్రమాన్ని అభినందించారు.

ప్రశ్న: చిన్నబోనాలలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రగుడు జంక్షన్ నుంచి ఊరిలోకి వచ్చే రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయి?
(సాయి, చిన్నబోనాల)
కమిషనర్: గతేడాది వీధికుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ ఆపరేషన్లు) చేయించాం. మరో నాలుగు రోజుల్లో పట్టణంలో ఏబీసీ టీం వచ్చి వీధి కుక్కలకు కు.ని. ఆపరేషన్లు, యాంటిరాబిస్ వ్యాక్సిన్ వేస్తుంది. జంక్షన్ల వద్ద జీబ్రాలైన్స్‌తోపాటు ట్రాఫిక్ సిగ్నల్స్ పెట్టిస్తాం.

ప్రశ్న: బైపాస్‌లో వీధిలైట్లు లేక ప్రమాదాలు అవుతున్నయి. ట్రాఫిక్ సిగ్నల్స్ పెట్టించాలి? వాహనాలు స్పీడ్ కంట్రోల్ చేయించండి?
(రాజు, రగుడు. వంగ మల్లేశం, రగుడు, సాయికృష్ణ, ప్రేరణ స్వచ్ఛంద సంస్థ)
కమిషనర్: బైపాస్‌రోడ్డులో సెంట్రల్ లైటింగ్, ఇతర అభివృద్ధి పనులకు రూ.4.60కోట్లు మంజూరయ్యాయి. మరో రెండు నెలల్లో పూర్తిచేస్తాం. ప్రజా సమస్యలపై ఆఫీస్‌కు వచ్చి నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

ప్రశ్న: సీసీ కెమెరాలు లేక ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతుండ్రు. కార్గిల్‌లేక్ కాల్వ సమస్యను పరిష్కరించాలి. సీసీరోడ్లు వేయించండి.
(పోకల సాయికుమార్, సాయినగర్)
కమిషనర్: సీసీరోడ్లు, మోరీల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ప్రణాళిక ప్రకారం పనులు చేపడుతున్నాం. రూ.5లక్షలతో 7వ వార్డు మోడల్‌వార్డుగా అభివృద్ధి చేస్తున్నాం. కార్గిల్‌లేక్ కాల్వను పరిశీలించి, చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: శ్మశానవాటిక ఎప్పుడ నిర్మిస్తారు? చికెన్, మటన్ వ్యర్థాలను రోడ్డుపై వేస్తున్నారు. పాతబస్టాండ్ శిథిలం కాకుండా చూడాలి.
(ప్రశాంత్‌గౌడ్, సర్దాపూర్, వంగ మల్లేశంగౌడ్, రగుడు)
కమిషనర్: శ్మశానవాటిక పనులు త్వరలోనే చేపడతాం. కాంట్రాక్టర్‌కు అప్పగించాం. రోడ్డుపై గుంతలు లేకుండా చర్యలు తీసుకుంటాం. చికెన్, మటన్ వ్యాపారులతో మాట్లాడి వ్యర్థాలను రోడ్లపై వేయకుండా నివారిస్తాం. పాతబస్టాండ్ సమస్య మా దృష్టిలో ఉంది. సత్వరమే పరిష్కరిస్తాం.

ప్రశ్న: మోరీలు పూడికతో నిండిపోతున్నాయి. 3వ వార్డులో పందుల సమస్య ఉంది.
(ఎల్లయ్య–సర్దాపూర్, రాజు–రగుడు, మధుసూదన్, కోర రమేశ్–బీవైనగర్)
కమిషనర్: అన్ని వార్డులకు ప్రత్యేకంగా పారిశుధ్య సిబ్బందిని నియమించాం. చంద్రంపేట, రగుడు గ్రామాలతో కలిసిన వార్డు కాబట్టి పెద్ద ఏరియా. స్వయంగా సిబ్బందితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాను. 3వ వార్డులో పందుల సంచారం లేకుండా చూస్తాం. బీవైనగర్ డ్రెయినేజీ సమస్య తీరుస్తాం.

ప్రశ్న: పార్కింగ్‌కు స్థలాలు కేటాయించండి. పోలీస్ చలాన్లు పెరిగిపోతున్నాయి
(భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయుడు)
కమిషనర్: సిరిసిల్ల పట్టణంలోని ప్రధాన వాణిజ్య, వ్యాపారాల ఏరియాల్లో పార్కింగ్ స్థలాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద బజార్ వంటి ప్రదేశాల్లో రోడ్ల విస్తరణ చేపడితే పార్కింగ్ స్థలం కేటాయిస్తాం. ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు కృషి చేస్తాం.

ప్రశ్న: మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ ఆగడం లేదు? రగుడు జంక్షన్‌లో ప్రమాదాలు జరగకుండా చూడాలి
(ఎల్లయ్య, సర్దాపూర్)
కమిషనర్: తాగునీటి పైపులైన్ లీకేజీని పరిష్కరిస్తాం. రెండు బైపాస్‌లు కలిసే అతిపెద్ద జంక్షన్ కాబట్టి.. అభివృద్ధి చేపట్టేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధమైంది. రూ.3కోట్లతో విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయిస్తాం. జీబ్రా లైన్స్ వేయించి, అభివృద్ధి పనులను రెండు నెలల్లో పూర్తి చేస్తాం.



కాల్వపనులు వేగవంతం చేయాలి



ముస్తాబాద్/సిరిసిల్లఅర్బన్: ముస్తాబాద్ మండల పరిధిలోని మల్లన్నసాగర్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. మద్దికుంట, మోహినికుంట, చీకోడు గ్రామాలలో చేపట్టిన కెనాల్ పనులను శనివారం పరిశీలించారు. డిస్ట్రిబ్యూటరీల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఉపకాల్వల పనులకు భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. అభ్యంతరాలు తెలిపిన రైతులతో చర్చించాలన్నారు. ముస్తాబాద్ మండలంలో 10 చెరువులను ఈ యాసంగి సీజన్‌లోనే నింపాలని సూచించారు. ప్రస్తుతం వస్తున్న నీరు సరిపోదని, ఇంకా ఎక్కువ విడుదల చేయాలని కోరారు. తంగళ్లపల్లి మండలంలో రంగనాయక, మల్లన్న సాగర్ నుంచి వచ్చే కాల్వలను పరిశీలించారు. పంట పొలాలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సిరిసిల్లలో 'బడ్జెట్ హోటల్'

- సౌర విద్యుత్ ఫలకాలతో నిర్మాణం
- పరిశీలించిన సందీప్‌కుమార్ సుల్తానియా

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 'బడ్జెట్ హోటల్'ను ఆధునిక హంగులతో నిర్మించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. సిరిసిల్ల రెండో బైపాస్ రోడ్డులో పెద్దూరు వద్ద నిర్మిస్తున్న భవనాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ మొదటి అంతస్తులో పూర్తి స్థాయిలో సౌర విద్యుత్ ఫలకాలను అమర్చి, హోటల్ అన్ని అవసరాలకు సౌర విద్యుత్ వినియోగించుకోవాలన్నారు. నెట్ జీరో ఎనర్జీ బిల్డింగ్‌గా సిరిసిల్ల బడ్జెట్ హోటల్ తీర్చిదిద్దాలని కోరారు. రూ.18 కోట్లతో జీ+1 విధానంలో నిర్మిస్తున్న ఈ భవనం పర్యాటకులకు పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ బడ్జెట్ హోటల్ అన్ని ఆధునిక హంగులతో మే మొదటి వారంలో సిద్ధమయ్యేలా పనులు పూర్తి చేయాలన్నారు. కాన్ఫరెన్స్ హాల్, గదులు శుభకార్యాయాలకు సరసరమైన ధరలకు అందించే వీలుంటుందన్నారు. అంతకుముందు ఆయన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేములవాడలోని హరితహోటల్‌ను సందర్శించారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, టూరిజం ఎండీ మనోహర్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, డీఆర్‌డీవో గౌతమ్‌రెడ్డి, డీపీవో రవీందర్ ఉన్నారు.



మినీ స్టేడియాన్ని పరిశీలిస్తున్న సందీప్‌కుమార్ సుల్తానియా

మినీస్టేడియం బాగుంది

సిరిసిల్లలోని మినీ స్టేడియం బాగుందని సందీప్‌కుమార్ సుల్తానియా కితాబిచ్చారు. రాజీవ్‌నగర్ రోడ్డులో నిర్మించిన మినీస్టేడియాన్ని సందర్శించారు. వాలీబాల్, షటిల్, కబడ్డీ కోర్టులను, వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించారు.

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన పద్మశాలీ నాయకులు



ఎస్పీ అఖిల్‌మహాజన్‌ను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

సిరిసిల్ల: జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్‌ను సిరిసిల్ల పట్టణ పద్మశాలీ సంఘం నాయకులు శనివారం కలిశారు. ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్‌ను జిల్లా పోలీస్ ఆఫీస్‌లో కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. పద్మశాలీ సంఘం సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు గోలి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, నాయకులు డాక్టర్ గాజుల బాలయ్య, దాసరి వెంకటేశం ఉన్నారు.

ఆటోను ఢీకొన్న వ్యాన్



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని పదిర శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ముస్తాబాద్ మండలం తెర్లుమద్దికి చెందిన సిర్రం తిరుపతియాదవ్(58) రాచర్లగొల్లపల్లిలో జరిగిన ఓ విందుకు హాజరయ్యాడు. తిరిగి ఆటోలో వెళ్తుండగా వ్యాన్ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటో పొలాల్లోకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడ్డ తిరుపతిని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బీదర్ దొంగల పనే!

- కొండగట్టు ఆలయ చోరీ కేసులో పురోగతి
- 24 గంటల్లోనే నిందితులను గుర్తించిన పోలీసులు
- సెల్‌టవర్ డంప్ ఆధారంగా ముగ్గురి నంబర్లు గుర్తింపు
- చోరీ అనంతరం కర్ణాటక పారిపోయిన దొంగలు
- పట్టుకువచ్చేందుకు కర్ణాటక వెళ్లిన ప్రత్యేక బృందం
- పొరుగురాష్ట్రం దొంగలని ముందే వెల్లడించిన 'సాక్షి'



ఆలయంలో చోరీ చేసిన దొంగలు (సీసీపుటేజీ)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లా కొండగట్టు చోరీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఆలయంలో వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన దొంగలను కర్ణాటకలోని బీదర్ జిల్లాకు చెందిన వారిగా చోరీ జరిగిన ప్రాంతంలో లభించిన సీసీ పుటేజీ, సెల్‌టవర్ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా గుర్తించారు. ఇటీవలే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్వయంగా పర్యటించి ఆలయాభివృద్ధికి రూ.600 కోట్లు ప్రకటించిన నేపథ్యంలో చోరీ జరగడం సంచలనం రేపింది. రాష్ట్రమంతా కొండగట్టు పుణ్యక్షేత్రంపై చర్చిస్తున్న నేపథ్యంలో ప్రధానాలయంలో చోరీ జరగడంతో పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని 24 గంటల్లోనే నిందితులను గుర్తించారు.

మధ్యాహ్నానికి కొలిక్కి వచ్చిన కేసు

సీఎం పర్యటించిన వారంరోజుల్లోనే ఆలయంలో చోరీ జరగడంపై పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించి మధ్యాహ్నానికి కేసులో కీలక పురోగతి సాధించారు. ఆలయంలో దొంగతనం చేసింది కర్ణాటకకు చెందిన ముఠాగా గుర్తించారు. దొంగలు 24వతేదీ శుక్రవారం తెల్లవారుజామున 1.20 గంటల తరువాత భేతాళ గుడి పక్క నుంచి ప్రధానాలయం వెనక తలుపులు బద్దలుకొట్టి లోనికి ప్రవేశించారు. లోనికి వచ్చే సమయంలో జనాల దృష్టి మరల్చేందుకు సెక్యూరిటీ దుస్తులు, చేతిలో లాఠీ, ఒంటిపై కొత్త పసుపు శాలువా కప్పుకుని వచ్చారు. శాలువాలో చోరీ చేసేందుకు వీలైన పనిముట్లు తీసుకొచ్చారు. ఉదయం 1.20నిమిషాల నుంచి ఉదయం 4 గంటల మధ్యలో దొంగతనం జరిగింది. ఈ మధ్యకాలంలో కొండగట్టుపై యాక్టివ్‌గా ఫోన్ నంబర్ల డేటాను పోలీసులు సేకరించారు.

కర్ణాటకకు బయల్దేరిన పోలీసులు

అందులో కొన్ని నంబర్లు కర్ణాటకకు చెందినవి. అనుమానాస్పదంగా కనిపించిన ఈ నంబర్లకు సంబంధించిన మరిన్ని వివరాలు సేకరించేందుకు కొండగట్టుపై సెల్‌ఫోన్ సేవలు అందించే సెల్‌టవర్ల నుంచి డంప్ (కాల్స్ వివరాలు) మొత్తం జల్లెడ పట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన నంబర్లు కర్ణాటకకు చెంది ఉండటం, చోరీకి ముందు తరువాత అక్కడ నుంచి మాయమవడంతో పోలీసులు వీటిపై ప్రత్యేక దృష్టిసారించారు. అనుమానాస్పద నంబర్ల చిరునామాలు, వీటి సీడీఆర్ (కాల్ డేటా రికార్డు)ను కూడా సంగ్రహించారు. ఆ నంబర్ల కాల్స్ కర్ణాటకకు చెందిన నంబర్లతో కనెక్ట్ అయి ఉన్నట్లు హిస్టరీ తేలడంతో మరింత లోతుగా అన్వేషించారు. దీంతో అవే నెంబర్లు మెట్‌పల్లి, కామారెడ్డిల మీదుగా బీదర్ వరకు ఆయా సెల్‌టవర్ల లోకేషన్లతో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో లభించిన వేలిముద్రలు కూడా కీలక ఆధారాలుగా మారాయని తెలిసింది. దీంతో నిందితులు బీదర్ జిల్లాకు చెందిన దొంగలుగా నిర్ధరణకు వచ్చారు. వెంటనే బీదర్ పోలీసులకు సమాచారం ఇచ్చి రెండు ప్రత్యేక బృందాలు కర్ణాటకకు బయల్దేరాయి.

దొంగలను పట్టుకున్న పోలీసులు..?

ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పోలీసు బృందం కర్ణాటకకు వెళ్లింది. దొంగలు అక్కడికి వస్తారని అనుకున్న పోలీసులకు శుక్రవారం రాత్రి నిరాశే ఎదురైనట్లు సమాచారం. శనివారం సాయంత్రం ఈ కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలిసింది. చోరీకి పాల్పడిన వారిలో ఒకరు దొరికినట్లు సమాచారం. నిందితులను పట్టుకున్నట్లు ప్రచారం జరుగుతున్నా.. ఈ విషయాన్ని పోలీసులు ఇంకా నిర్ధారించలేదు. ఆదివారం లేదా సోమవారం దొంగలను తెలంగాణకు తీసుకువచ్చి, ప్రెస్‌మీట్ నిర్వహించే అవకాశాలున్నాయని తెలిసింది. పోలీసులు విడుదల చేసిన సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా దొంగలు మహారాష్ట్ర లేదా పొరుగురాష్ట్రం వారి అయి ఉంటారని 'సాక్షి' ముందే వెల్లడించిన విషయం తెలిసిందే.

నైట్‌వాచ్‌మన్‌పై సస్పెన్షన్ వేటు

- ఇద్దరు ఆలయ ఉద్యోగులు, నలుగురు హోంగార్డులకు మెమోలు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వేకువ జామున చోరీ జరిగేందుకు సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యమే కారణమని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈమేరకు నైట్‌వాచ్‌మన్ శంకర్‌ను సస్పెండ్ చేస్తూ ఆలయ ఈవో వెంకటేశ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా టెంపుల్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, హుండీ కీపర్ చంద్రమౌళి, హోంగార్డులు కొండ రమేశ్, కొడిమ్యాల రమేశ్, రాజేశ్, అంజయ్యకు మెమోలు జారీచేశారు. వీరు విధుల్లో నిర్లక్ష్యం వహించారని, నిర్దేశిత సమయంలోగా సంజాయిషీ ఇవ్వాలని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. అయితే, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులను వదిలేసి చిరుద్యోగులపై వేటు వేయడం ఏమిటనే చర్చ సాగుతోంది.

రైతుల వరప్రదాయిని రాయిని చెరువు

- టెస్కాబ్ ఛైర్మన్ రవీందర్‌రావు



చెరువు మ్యాప్ పరిశీలిస్తున్న రవీందర్‌రావు

వీర్నపల్లి(సిరిసిల్ల): రాయిని చెరువు ఈ ప్రాంత రైతులకు వరప్రదాయిని అని, పూర్తిస్థాయిలో మరమ్మతు చేస్తామని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. వీర్నపల్లి మండలం మద్దిమల్ల పరిధిలో తొమ్మిదో ప్యాకేజీ కింద రాయిని చెరువు మరమ్మతు పనులను శనివారం ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ రాయిని చెరువును మరమ్మతులో నాలుగు గ్రామాల పరిధిలోని 900 ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు.

రాని నీళ్లకు ప్రచారం ఎక్కువ

- బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

వీర్నపల్లి(సిరిసిల్ల): ఇంటింటికీ తాగునీరు అందించామని అధికార పార్టీ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు లేవని బీజేపీ రాష్ట్ర నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లో భాగంగా శనివారం మండలంలోని బాబాయ్‌చెరువుతండా, భూక్యాతండాలలో సమావేశమయ్యారు. శ్రీనివాస్ మాట్లాడుతూ మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని, వృద్ధాప్య పింఛన్లు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బూత్ అధ్యక్షుడు రాకేశ్, రఘు, శక్తికేంద్రం ఇన్‌చార్జి భూక్యా రమేశ్, పార్టీ మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, నాయకులు గుండెల్లి వేణు, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తుదిపోరుకు సిద్ధం కావాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్



మాట్లాడుతున్న లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఏబీసీడీ వర్గీకరణ కోసం కేంద్రంతో తేల్చుకునేందుకు మాదిగలు, మాదిగ ఉపకులస్తులు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కానాపురం లక్ష్మణ్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మార్చి 15న జాతీయ రహదారులను దిగ్బంధించాలన్నారు. 15న హైదరాబాద్, విజయవాడ సరిహద్దుల ముట్టడికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. వడ్లూరి రాజు, కట్కూరి సురేశ్, శరవిందు, నర్సయ్య, పర్శరాములు, శంకర్, చంద్రయ్య, సతీశ్ పాల్గొన్నారు.

పది ఇంటర్నల్ మార్కులపై ఆరా

- పాఠశాలల్లో ముగిసిన తనిఖీలు
- 17 స్కూళ్లలో రెండు బృందాలు



తనిఖీలు నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారులు

గంభీరావుపేట(సిరిసిల్ల): ఏప్రిల్ మొదటి వారంలో పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులపై అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు విద్యాశాఖ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుంది. ఇంటర్నల్ మార్కుల విషయంలో ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా వేస్తారనే ఆరోపణలు వస్తుండడంతో ప్రత్యేక బృందాలు పాఠశాలల్లోకి వెళ్లి మార్కులు, రికార్డులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సామర్థ్యాన్ని అంచనా వేస్తున్నారు. ఈనెల 21న ప్రారంభమైన ఇంటర్నల్ మార్కులపై ఆరా కార్యక్రమం శనివారంతో ముగిసింది. గంభీరావుపేట మండలంలో 17 ఉన్నత పాఠశాలల్లో రెండు బృందాలు పర్యటించాయి. ఈ మార్కులు కీలకంగా మారిన నేపథ్యంలో తనిఖీలకు ప్రాధాన్యత సంతరించుకుంది.

మండలపరిషత్‌లో విద్యుదాఘాతం



ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మంటలు లేచాయి. వాష్‌రూమ్‌లోని స్విచ్‌బోర్డు నుంచి మంటలు వచ్చాయి. అవి క్రమంగా గదిలోని విద్యుత్ తీగలకు పాకడంతో పొగ కమ్మింది. ఆఫీస్‌లోని ఆరు కంప్యూటర్లు కాలిపోయాయి. మంటలు పక్కగదిలోకి వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు.

వివాహిత ఆత్మహత్య




హసీనా ఉరఫ్ స్వాతి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం కేంద్రంలోని కేసీఆర్‌కాలనీ చెందిన హసీనా ఉరఫ్ స్వాతి(30) ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. హసీనా మతాంతర వివాహం చేసుకుంది. భర్త బతుకుదెరువు కోసం నాలుగు నెలల క్రితం గల్ఫ్ దేశాలకు వెళ్లాడు. హసీనా గ్రామంలో ఒకరి వద్ద రూ.లక్ష చిట్టి వేసింది. ఆ డబ్బులను సమీప బంధువు ఒకరు తీసుకొని చేతులెత్తేయడంతో మనస్థాపానికి గురై ఈనెల 20న ఎలుకల మందు తాగింది. కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచింది. గల్ఫ్‌లో ఉన్న భర్త హమీద్‌కు సమాచారం అందించారు. అతను ఆదివారం సాయంత్రం వరకు వచ్చే అవకాశాలు ఉండగా.. మృతదేహాన్ని ఫ్రీజర్‌లో ఉంచారు. మృతురాలికి కుమారుడు ఆసిఫ్ ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.













హరితహారం పనులు భేష్

ముస్తాబాద్(సిరిసిల్ల): హరితహారంలో నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగాయని, ఇక్కడ చేపట్టిన పనులు బాగున్నాయని కేంద్ర బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. నామాపూర్, చిప్పలపల్లి గ్రామాల్లోని ప్రధాన రహదారి వెంట నాటిన మొక్కలను కేంద్ర బృందం శనివారం పరిశీలించింది. కేంద్రం ద్వారా ఈ పథకానికి వస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటున్న తీరును పరిశీలిస్తున్నామని తెలిపారు. డీఈఈ శ్రీదేవి, ఎస్పీఎంలు శాంతి, కిరణ్, క్వాలిటీ కంట్రోల్ ఏఈ సుదర్శన్, ఎంపీడీవో రమాదేవి, ఏపీవో ఆనంద్‌మోహన్, ఏఈ రాజమల్లయ్య ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

సిరిసిల్లటౌన్: భవన నిర్మాణరంగ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ప్రతి కార్మికుడికి రూ.5వేలు పింఛన్ అందించాలని కోరారు. కార్మిక వెల్ఫేర్‌బోర్డు ద్వారా రావాల్సిన సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. అధ్యక్షుడు మిట్టపెల్లి రాజమౌళి, నాయకులు గీసా భిక్షపతి, రాపెల్లి రమేశ్, గురజాల శ్రీధర్, సామనపల్లి రాములు పాల్గొన్నారు.

ఒమన్‌లో అలయ్.. బలయ్



సిరిసిల్లటౌన్: ఒమన్‌లో అంబేద్కర్ సేవా సమి తి ఆధ్వర్యంలో శనివారం అలయ్.. బలయ్ నిర్వహించారు. మస్కట్‌లోని రూసేల్ గార్డెన్స్‌లో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గాలి గాని రాజు నేతృత్వంలో జరిగాయి. 'రాజ్యాంగాన్ని' సమితి ప్రతినిధులు ఆవిష్కరించారు. ఆటపాటలతో సభ్యులు సరదాగా గడిపారు. సమితి ప్రతినిధులు మేడిపట్ల లక్ష్మణ్, సుంకపాక భూమేశ్, రాజేందర్, ఎల్లయ్య పాల్గొన్నారు.

శిక్షల శాతం పెరగాలి



సిరిసిల్లక్రైం: కోర్టు కేసులలో శిక్షల శాతాన్ని పెంచడం, నిందితులకు శిక్షపడేలా చేయడం ద్వారా ప్రజల్లో పోలీస్‌శాఖపై నమ్మకం పెరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం కోర్టు డ్యూటీ ఆఫీసర్లకు శిక్షణ నిర్వహించారు. కోర్టు అధికారులు సమన్వయంతో పనిచేసి సాక్ష్యులను, నిందితులను కోర్టుల్లో సకాలంలో హాజరుపరచాలని సూచించారు. ఏఎస్పీ చంద్రయ్య, ఎస్సై శ్రీనివాస్, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సోషల్ మీడియాలో వస్తువులపై భారీ డిస్కౌంట్స్ అని వచ్చే ప్రకటనల మెసేజ్‌లను నమ్మి కొని మోసపోవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్‌మోసాలకు గురైతే ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని లేదా 1930 నంబర్‌కు కాల్‌చేయాలని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS FOR GUIDENCE

- Admissions for Guidence B.Tech/M.Tech/ M.B.A, LLB / B.Sc, M.Sc Agri, P.G (All), Ph.d Few Seats Available. Cont: 9391471754, 8985533447, Hyd. [W-775785]

SERVICES

- వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్ర: 94630 26237 [T-P1751]

TO LET

- TO LET: Single Room for Office Near Shiva Theater, Jyothinagar, Karimnagar. Cont: Cell: 7569232003 [K-1219957]

మూలికావైద్యం

- అంగస్తంభన లేకపోవటం, సెక్స్‌లో ఎక్కువసేపు చేయలేకపోవడం, అంగం లావుగా, దృఢంగా, బలంగా ఉండుటకు మూలికఔషధం, వయస్సు పైబడిన వారు కూడా వాడవచ్చు. డా.సి.హెచ్, రామకృష్ణ, VJA. ఫోన్ : 84650 56299 [V-5638]

BUSINESS OFFER

- పర్మినెంట్ బిజినెస్ పార్ట్‌టైమ్ పెట్టుబడిలోనే లైఫ్ టైమ్ మాస్టర్ ఫ్రాంచైజీ లీడింగ్ మల్టీ బిజినెస్ డైలీ సపోర్టు+ట్రైనింగ్+మంచి భవిష్యత్తు + ఆదాయం +15 సం॥ల అనుభవం. ఫోన్ : 9908743603 [HA-5600]
- Wanted Franchise / Agents in Hyderabad & All Telangana & All Andhra Pradesh. New Maruthi Couriers and Cargo Services Call: 9010459283 [H-793615]
- Invest small amount in trading company and get daily returns : 8317689472 [H-787446]

WANTED

- క్వాలిఫైడ్ ల్యాబ్ టెక్నీషియన్స్, రిసెప్షనిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర॥ డా॥ ఓం డయాగ్నోస్టిక్స్, సివిల్ హాస్పిటల్ ప్రక్కన, కరీంనగర్. సెల్: 9246930093, 6301090216 [K-1232935]
- విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోర్ డ్రైవరు-3, హెల్పర్లు-5, జీతం: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1226251]
- Banking Collections Field Executive Salary: 15,000 + Good Incentive (2 Wheeler Must) Address: 6-3-191/C/1, Fortune 9, 2nd Floor, Opposite Yashodha Hospital Road, Somaji guda, Hyderabad - 500082 Contact Numbers: 8220640613/ 7305045987 [HA-9777]
- పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-792834]



For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

బాధిత రైతులకు బీఎస్పీ మద్దతు



ధర్నా శిబిరంలో బీఎస్పీ నాయకులు, రైతులు

గంభీరావుపేట(సిరిసిల్ల): సమస్యల పరిష్కారానికి గంభీరావుపేట మండలం నర్మాలలో ఫుడ్ ఫ్యాక్టరీ భూ బాధితులు చేపట్టిన ధర్నాకు బీఎస్పీ నాయకులు శనివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామిగౌడ్, కర్రోల్ల రాజు రైతులకు మద్దతునిస్తూ ధర్నాలో పాల్గొన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. భూసేకరణ చట్టంప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, రాచర్ల గుండారంలో శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదమధ్యతరగతి కుటుంబాలకు వైద్యసాయం అందించేందుకు సీఎంఆర్ఎఫ్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నిమ్మలక్ష్మి, భూక్యశంకర్, ఎంపీటీసీ ఆపెరా సుల్తానామాజీద్, గ్రామ మహిళా అధ్యక్షురాలు అంబటి పద్మ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లారెడ్డి,నర్సయ్య, శంకరయ్య, కిషన్‌రెడ్డి, భూమయ్య ఉన్నారు.

గంభీరావుపేట: మండలంలోని గజసింగవరంలో శనివారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుతారి బాలరాజు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడరూరల్: రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు ఇటీవల చాలా వస్తున్నాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. వేములవాడ మండలంలోని అగ్రహారం డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలకు హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సిరిసిల్ల చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యం, పరిజ్ఞానం కలిగిన విద్యార్థులకే అవకాశాలు వస్తున్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సీసీ సభల్లో జిల్లా నేతలు..



రాయ్‌పూర్‌లో సభలో ఆది శ్రీనివాస్ తదితరులు

సిరిసిల్లటౌన్/వేములవాడ: జాతీయ కాంగ్రెస్ సభలకు జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ నేతృత్వంలో డీసీసీ శ్రేణులు తరలివెళ్లారు. శనివారం ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయ్‌పూర్‌లో 85వ ప్లీనరీ సమావేశాల్లో పాల్గొన్నారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్, తొట్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు నిర్వహిస్తున్న సీఐ ఉపేందర్

సిరిసిల్లఅర్బన్: తంగళ్లపల్లి మండలకేంద్రంలో రూరల్ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో శనివారం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బైక్‌లు ఆపి బ్రీత్ ఎనలైజర్‌తో టెస్టులు చేశారు. మద్యంతాగిన, సరైన పత్రాలు లేనివారికి జరిమానాలు విధించారు. సీఐ ఉపేందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యంతాగి వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్సై లక్ష్మారెడ్డి, ఏఎస్సై, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





నాట్య మయూరాలు

- విద్యావికాసంతో పాటు నాట్యానురక్తి
- తీరిక వేళల్లో సద్వినియోగం
- శాస్త్రీయ నృత్యాల్లో తర్ఫీదు పొందుతున్న చిన్నారులు

సిరిసిల్ల అర్బన్: చదువుతో పాటు అభిరుచి గల రంగాల్లో చిన్నారులు రాణించేందుకు నేటితరం తల్లిదండ్రులు శ్రమిస్తున్నారు. అవకాశం ఉన్న మేరకు తీరిక సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూనే తమ మనోభీష్టాన్ని నెరవేర్చుకుంటున్నారు. విద్యావికాసానికి తోడుగా మనోల్లాసాన్నిచ్చే వివిధ రంగాల్లో తమ పిల్లలకు తర్ఫీదునిప్పిస్తున్నారు. జిల్లాకేంద్రంలో పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులకు పాఠశాల విద్యకు ప్రాధాన్యతనిస్తూనే శాస్త్రీయ, సంగీత కళారంగాల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. జిల్లాలోని పలు శాస్త్రీయ నృత్యశిక్షణ సంస్థల్లో తర్ఫీదు పొందుతూ అవకాశాలున్న సందర్భాల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

చూడచక్కని ప్రతిభ...

ప్రస్తుత కాలంలో పిల్లలను చదువుల యంత్రాలుగా చూస్తున్నారు. రోజు బండెడు పుస్తకాలు మోస్తూ, ఉదయం నుంచి సాయంత్రం వరకు పుస్తకాలతో కుస్తీపడుతూ భరించలేని ఒత్తిడికి లోనవుతున్నారు. కానీ సిరిసిల్ల పట్టణానికి చెందిన పలువురు చిన్నారులు ఓవైపు చదువులో రాణిస్తూనే మరోవైపు నృత్యకళలో ప్రతిభ కనబరుస్తున్నారు. తల్లిదండ్రులు ప్రోత్సహిస్తుండడంతో మరింతగా రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు సాంస్కృతిక కళాప్రదర్శనల్లో ప్రతిభచాటుతూ అవార్డులు అందుకుంటున్నారు.

సిరిసిల్ల పట్టణానికి చెందిన శ్రీరాములు మహాన్విత 8వ తరగతి చదువుతుంది. చిన్నప్పటి నుంచి డ్యాన్స్‌పై ఆసక్తి ఉండడంతో తల్లిదండ్రులు డ్యాన్స్‌నేర్పించారు. పాఠశాలలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేది. నాలుగేళ్ల క్రితం నుంచి కూచిపూడి నాట్యంలో శిక్షణ పొంది పలు ప్రదర్శనలు ఇచ్చి మన్ననలు పొందింది. వేములవాడలో శివరాత్రి వేడుకల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రం అందుకుంది

– శ్రీరాముల మహాన్విత, కూచిపూడి నృత్యకారిణి

పట్టణానికి చెందిన వెగ్గలం నిష్క 9వ తరగతి చదువుతోంది. చిన్నప్పటి నుంచి నాట్యంపై ఆసక్తి ఉండడంతో ఆమె అభిరుచులను గుర్తించిన కుటుంబ సభ్యులు ప్రోత్సహించారు. దీంతో కూచిపూడి నాట్యంలో మూడేళ్లుగా బాలత్రిపుర సందరి శిక్షణాలయంలో కూచిపూడి నేర్చుకుంటోంది. పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తూ ప్రతిభ చాటుతుంది.

–వెగ్గలం నిష్క



మ్యాన అగస్త్య పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. ఓవైపు చదువుల్లో రాణిస్తూ తీరిక సమయాల్లో కూచిపూడి నాట్యం నేర్చుకుంటోంది. ఇటీవల వేములవాడలో జరిగిన శివరాత్రి వేడుకల్లో శివుని వేషంలో అద్భుతమైన నృత్యప్రదర్శనతో చూపరులను మంత్ర ముగ్దుల్ని చేసింది. పలు సాంస్కృతిక వేదికలపై పాల్గొని అవార్డులను సొంతం చేసుకుంది.

– మ్యాన అగస్త్య, సిరిసిల్ల



రైతులకు తప్పని యూరియా తిప్పలు



యూరియా కోసం బారులు తీరిన రైతులు

రుద్రంగి(వేములవాడ): పంటల సాగులో రైతన్నలకు యూరియా కష్టాలు తప్పడం లేదు. పంటలకు యూరియా వేసే సమయం దాటిపోతుండడంతో అన్నదాతలు యూరియా కొరతతో ఆందోళన చెందుతున్నారు. యూరియా కోసం 15రోజులుగా ఎదురుచూస్తూ విసుగెత్తి పోతున్నారు. ఒక లోడ్ యూరియా వచ్చినా అది ఎవరికీ సరిపోవడం లేదు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం లారీలోడ్ యూరియా రావడంతో రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. అది కొంతమందికి సరిపోవడంతో మిగతా రైతులు నిరాశతో వెనుదిరిగారు. మళ్లీ లోడ్ ఎప్పుడు వస్తుందో పంటలకు యూరియా ఎప్పుడువేస్తామో నని ఆందోళన చెందుతున్నారు. సమయం దాటిన తర్వాత యూరియా వేసిన ప్రయోజనం ఉండదని,అధికారులు స్పందించి పంటలకు యూరియా సమయానికి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాంసం వ్యర్థాలు బయట పడేయొద్దు

- నిబంధనలు అతిక్రమిస్తే..కఠిన చర్యలు
- విలీన గ్రామాల వ్యాపారులకు అల్టిమేటం
- మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య

సిరిసిల్లటౌన్: విలీన గ్రామాల్లోని మటన్, చికెన్ విక్రయదారులు వ్యర్థాలను ఇష్టానుసారంగా పడేయొద్దని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య హెచ్చరించారు. శనివారం కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు వ్యాపారులు ఇష్టానుసారంగా మాంసం వ్యర్థాలను పడేయడంపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. బల్దియా సిబ్బంది ప్రతిరోజు సేకరించే చెత్త సేకరించే వాహనానికి వ్యర్థాలు అందించాలని, స్వచ్ఛనిబంధనలు అతిక్రమిస్తే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యాపారులు, అధికారులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ



ఆలయంలో చిందరవందరగా వస్తువులు

ముస్తాబాద్ (సిరిసిల్ల): మండలంలోని మోహినికుంట ఎల్లమ్మ ఆలయంలో గుర్తుతెలియని దొంగలు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఈమేరకు గీత కార్మికులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆలయం తలుపుల తాళాలు బద్దలుకొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు..బంగారు,వెండి ఆభరణాలతోపాటు హుండీని ఎత్తుకెళ్లారు. సుమారు రూ.లక్ష వరకు నగదు చోరీకి గురైందని గౌడ సంఘం మండల అధ్యక్షుడు బాలరాజు తెలిపారు. పోలీసులు ఘటనస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

ట్రాక్టర్ పట్టివేత

చందుర్తి(వేములవాడ): మండలంలోని సనుగుల గ్రామశివారులోని అటవీప్రాంతాన్ని చదును చేస్తున్న ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారులు పట్టుకుని శనివారం సాయంత్రం చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అటవీ ప్రాంతాన్ని అక్రమంగా సాగుచేస్తున్నారన్న సమాచారం మేరకు పట్టుకున్నట్లు ఫారెస్టు సెక్షన్ అధికారి రవీందర్‌రావు, బీట్ అధికారి బాలకృష్ణ తెలిపారు. ట్రాక్టర్ యాజమనిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత...

ముస్తాబాద్: మండలంలోని తెర్లుమద్ది వద్ద ఇసుక ట్రాక్టర్‌ను శనివారం పట్టుకున్నట్లు ఆర్ఐ శ్యామ్ తెలిపారు. గండిలచ్చపేట మానేరు వాగునుంచి ముస్తాబాద్ వైపు వస్తున్న ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని ఠాణాకు తరలించామన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీరామ్ మనోజ్

వేములవాడరూరల్: విద్యార్థుల ఉద్యోగసాధనకు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ శ్రీరామ్‌మనోజ్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ స్కిల్స్ అనే అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఉద్యోగ సాధనకు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, క్రమశిక్షణ, నిబద్ధత, సమయపాలన, సహానుభూతి అవసరమన్నారు. నిరుద్యోగ యువత నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు టాస్క్‌చేస్తున్న కృషిని వివరించారు. ఉద్యోగ సాధనకు ఇంగ్లిష్‌పై పట్టు, సమాచార నైపుణ్యం, శరీర భాష, బృంద చర్చలు, మౌఖిక పరీక్షలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్, రవికుమార్, దాసరి సాగర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో

కోనరావుపేట/వేములవాడరూరల్/ముస్తాబాద్/బోయినపల్లి/ఎల్లారెడ్డిపేట/చందుర్తి: పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదివిమంచి ర్యాంకులు సాధించాలని కోనరావుపేట ఎంఈవో దూస రఘుపతి, వేములవాడలో ఎంఈవో బన్నాజీ కోరారు. ధర్మారం కోనరావుపేట కేజీబీవీ, నిజామాబాద్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు అభ్యాసన దీపికలు శనివారం పంపిణీ చేశారు. పదోతరగతి ఫలితాల్లో బాలికలదే పైచేయి కావాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు ఆకాంక్షించారు. ముస్తాబాద్ కస్తూరిబా బాలికల పాఠశాలలో ప్రభుత్వం జారీచేసిన స్టడీ మెటీరియల్‌ను అందించారు. బోయినపల్లి మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్, కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ జెడ్పీపాఠశాలలో హెచ్‌ఎం శేఖర్, చందుర్తి మండలం ఎన్గల్ జెడ్పీపాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ లింగంపల్లి సత్తయ్య, హెచ్‌ఎం పారం లక్ష్మీనారాయణ అభ్యాసన దీపికలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ఈ పుస్తకాలు అందిస్తున్నామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి జిల్లాస్థాయిలో ర్యాంకులు సాధించాలని కోరారు.

నెహ్రూనగర్ స్కూల్‌లో క్విజ్ పోటీలు



బహుమతులందుకుంటున్న విద్యార్థులు

సిరిసిల్లఎడ్యుకేషన్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని నెహ్రూనగర్ జెడ్పీపాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల పరిసరాల్లోకి వివిధ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో నెహ్రూ నగర్ మండలపరిషత్ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. రెండోస్థానంలో గోపాల్‌నగర్ మండల పరిషత్ పాఠశాల విద్యార్థులు నిలిచారు. విజేతలకు హెచ్‌ఎం అనురాధ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ద్యావనపల్లి పరమేశ్వర్, కోడం భారతి, అడుపకీర్తి, చిమ్మని సువర్ణ , మామిండ్ల వేణు, రమేశ్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల ఎంపికపై అభ్యంతరాలు



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

ముస్తాబాద్: మండలంలోని చీకోడులో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డబుల్‌బెడ్రూం ఇళ్లలబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. 257 మంది దరఖాస్తు చేసుకోగా, 57 మంది అర్హులను గుర్తించారు. 47 ఇళ్లకు మాత్రమే మంజూరు ఉండడంతో పలువురు అభ్యంతరాలు తెలిపారు. ఇళ్లు ఉన్న అనర్హులనే ఎంపిక చేశారన్నారు డీసీ సురేశ్, సర్పంచ్ రజిత, ఉపసర్పంచ్ నాగరాజు తదితరులున్నారు. అనంతరం ముస్తాబాద్, తుర్కపల్లి, గూడెం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఉపాధిహామీ పనుల గుర్తింపు, పంచాయతీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల ప్రగతి, లబ్ధిదారుల ఎంపికపై సమీక్షించారు. సర్పంచ్‌లు మాట్లాడుతూ.. పల్లెల అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు సహకరించాలన్నారు. సర్పంచ్‌లు పద్మ, సుమతి, సరిత, కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తవ్వకాలు చేపడితే చావుకైనా సిద్ధమే!

- గ్రానైట్ వ్యాపారులను అడ్డుకున్న గ్రామస్తులు



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

వేములవాడరూరల్: వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్న తమను వీధిపాలు చేయొద్దంటూ గ్రానైట్ వ్యాపారులను రైతులు అడ్డుకున్నారు. మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామశివారులో లింబాద్రి బోరు గ్రానైట్ కంపెనీ ఆధ్వర్యంలో కొంతకాలం క్రితం మైనింగ్‌కు అనుమతులు పొందారు. ఈ విషయంపై శనివారం రెవెన్యూ అధికారులు, మైనింగ్‌శాఖ, సర్వేయర్‌తో కలిసి హద్దులు ఏర్పాటుకు ఆ ప్రాంతానికి రాగా ఆ ప్రాంత రైతులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈవిషయంపై 10 రోజుల క్రితమే ఎంపీటీసీ కవిత, కలెక్టర్‌కు వినతిపత్రం అందించామన్నారు. ఈక్రమంలో కలెక్టర్ మూడుశాఖల అధికారులకు సర్వే రిపోర్టు ఇవ్వాలని ఆదేశాలివ్వడంతో అధికారులు శనివారం అక్కడికి వచ్చారు. విషయం తెలుసుకున్న రైతులు హద్దులు ఏర్పాటు చేయొద్దంటూ అడ్డుకున్నారు. అక్కడికి వచ్చిన డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

పే..ద్ద చేప చిక్కింది!



వలలో చిక్కిన 11కిలోల చేపతో మత్స్యకారుడు

చందుర్తి (వేములవాడ): మండలంలోని కట్టలింగంపేట గుర్నాథం చెరువులో చేపలు పడుతుండగా మత్స్యకారులకు పెద్దచేప చిక్కింది. చెరువులోకి దిగి చేపలు పడుతున్న యెల్లే దశరథం, గణేశ్ వలవేయగా 11కిలోల బరువైన (గ్రాస్‌కట్) గడ్డిచేప లభ్యమైంది. రెండేళ్ల క్రితం చేపపిల్లలు చెరువులో వేయగా, చెరువులోని గుంతల్లో వేట సాగించారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



చెక్కులు అందిస్తున్న నాయకులు

ముస్తాబాద్: బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ ఎప్పటికి అండగా ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు అన్నారు. గోపాల్‌పల్లె, రామలక్ష్మణపల్లెలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు సురేశ్, సతీశ్ కుటుంబాలకు శనివారం చెక్కులు పంపిణీ చేశారు. రూ.2లక్షల చొప్పున ప్రమాద బీమా చెక్కులు అందించారు. ప్రభుత్వపరంగా కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటామన్నారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్‌లు రవీందర్ రెడ్డి, నరేశ్, కిషన్‌రావు, నాయకులు విజయరామారావు, నాగరాజు, గురుబాబు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని బాగుచేయిస్తా



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న జయవర్ధన్

సిరిసిల్లఅర్బన్: తంగళ్లపల్లి మండలంలోని గ్రంథాలయాన్ని బాగు చేసేందుకు బీఆర్ఎస్, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ జిల్లా అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్ ముందుకువచ్చారు. శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన'పత్తాలేని గ్రంథాలయం' అనే శీర్షికకు ఆయన స్పందించారు. గ్రంథాలయాన్ని పరిశీలించి స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రంథాలయ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. గ్రంథాలయానికి అవసరమయ్యే మెటీరియల్స్, పుస్తకాలు అందజేస్తానని హామీ ఇచ్చారు.

బీటీరోడ్డు మరమ్మతులు ప్రారంభం

గంభీరావుపేట: మండలంలోని ముస్తఫానగర్ గ్రామశివారు నుంచి మాచారెడ్డి రోడ్డు వరకు నాలుగు కిలోమీటర్ల బీటీ రోడ్డు మరమ్మతులు శనివారం ప్రారంభమయ్యాయి. రోడ్డు మరమ్మతులకు మంత్రి కేటీఆర్, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు సహకారంతో రూ. 2కోట్లు మంజూరయ్యాయి. పనులు చేపట్టినందుకు వార్డుసభ్యుల ఫోరం కన్వీనర్ బండ రమేశ్, ముస్తఫానగర్ ఉపసర్పంచ్ నర్సింహులు,నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర పథకాలు ప్రజలకు వివరించాలి

కోనరావుపేట: కేంద్ర ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మండల అధ్యక్షుడు గొట్టె రామచంద్రం అన్నారు. కొండాపూర్‌లో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించి మాట్లాడారు. ప్రధానిమోదీ ప్రజలకోసం, రైతుల కోసం అమలుచేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తలు కష్టపడి పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు గోపాడి సురేందర్‌రావు ఒగ్గు ప్రభాకర్, మండల నాయకులు బైరగోని సురేశ్, పూండ్ర రాజిరెడ్డి, దామోదర్‌రెడ్డి, యశోద రాజు, లక్ష్మారెడ్డి, బిక్షపతి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ కాలనీలో నీటికి తిప్పలు



నీటి కోసం అవస్థలు పడుతున్న కాలనీ వాసులు

సిరిసిల్లఅర్బన్: తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని కేసీఆర్‌కాలనీలో నీటి కటకట ఏర్పడింది. రెండు రోజులుగా మంచినీటి సరఫరాలో అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు మున్సిపల్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు జరుగుతున్నాయని ఇంకా నాలుగు రోజులు సమయం పడుతుందన్నారు. కనీసం ట్యాంకర్లతో నీటిని సరఫరాచేసి నీటి ఎద్దడిని తొలగించాలని కోరగా, ట్యాంకర్లు ఖాళీగా లేవని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని కాలనీవాసులు వాపోయారు. దీంతో చేసేదేమిలేక కాలనీ పార్క్‌లోని బోర్‌మోటర్ నుంచి నీటిని తీసుకెళ్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. వేసవి ప్రారంభానికి ముందే నీటికోసం ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని కోరారు.

బీఆర్ఎస్‌కు ఓటుద్వారా బుద్ధిచెప్పాలి



మాన్వాడలో మాట్లాడుతున్న బొడిగ శోభ

బోయినపల్లి(చొప్పదండి): బీఆర్ఎస్‌కు ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మాన్వాడ గ్రామంలో బీజేపీ శక్తి కేంద్రం స్ట్రీట్ కార్నర్ సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలు గుర్తించి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తేవాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నేరుగా నిధులు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు ఉదారి నర్సింహాచారి, రామిడి శ్రీనివాస్, సారంపల్లి రాజు, నడిగొట్టు శ్రీనివాస్, పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899